# ఎక్వేరియం

# మినీ కథ

ఆ సమయంలో నిండుగా సందడిగా వుండాల్సిన పద్మా హోటల్ ఆ రోజు ఖాళీగా వెలాతెలాబోతూ ప్రజలందరికి ఒక్కసారే జ్ఞానోదయం కలిగి బహిష్కరించారానేటట్లుగా వుంది.

నేబుద్ధిజ్ఞానం లేనివాడ్ని, ఇంకారానివాడ్ని కావటం చేత పద్మాహోటలులోని కెళ్ళి ఫ్యాను క్రింద సీట్లో వదిలంగా, సుఖంగా సర్దుకూర్చుని, టిఫిన్‌కి ఆర్డరిచ్చి, చుట్టూచూసేను. నాలాంటి బుద్ధిహీనులైన బ్రదర్స్ అక్కడక్కడ కూర్చునున్నారు. నేను మళ్ళీ తలతిప్పేసరికి, నాముందు టిఫిన్ పొగలు కక్కుతూ సిద్ధంగా వుంది. మంది తక్కువగా వుంటే టిఫినుగూడా రుచిగా వుంటుంది కాబోలు అనుకుటూ పనిప్రారంభించబోతూ అప్పుడు చూసేను అతడ్ని.

పదమూడు పద్నాలుగేళ్ళ వయసుంటుంది. జుట్టంతా ఎర్రగా అట్టలుకట్టుకుపోయింది. మొహం, కాళ్ళు చేతులు మట్టిగొట్టుకుపోయి, అసహ్యంగా వున్నాయి. తనకన్నా దాదాపుగా పదిసంవత్సరాలు ఎక్కువ వయస్సు గలవాడి ప్యాంటు, చొక్కా ధరించటం చేత చిత్రంగా వుంది చూట్టానికి. వుండివుండి ఎడంచేతిని జుట్టులోకి పోనిచ్చి బరబరమంటూ బరుక్కుంటున్నాడు. అతగాడ్ని చూడంగానే నాకు చెప్పలేనంత అసహ్యం రోతగల్గినాయి. పైగా వాడు ఆకలిగా నాముందున్న ప్లేటులోని పదార్థాలవంక చూస్తున్నాడు. దాంతో నాకు మరింత చిరాకు పుట్టుకొచ్చింది. అసలిలాంటి వాళ్ళనిలోనికెలా రానిస్తారోగదా? ఛ ఛ. పద్మాహోటలుగూడా పాడైపోయింది.

మెల్లిగా టిఫెన్ తింటూనే వాడికి తెలీకుండానే వాడ్ని గమనిస్తున్నాను. అంతలో సప్లయర్ వచ్చాడు. వాణ్నిచూసి సప్లయిరుగూడా నాలాగే జుగుప్సగా మొహం పెట్టి ఏంకావాల న్నట్టు కళ్ళతోటే ప్రశ్నించాడు. 'ఏక్ చాయ్' అన్నాడామురికి బాలుడు. సప్లయర్ బాబు వెళ్ళిపోయేడు. మురికిబాబు నాప్లేటువంక చూస్తూనే టేబిలుపైవున్న నీళ్ళున్న స్టీలుగ్లాసుని చేతిలోకి తీసుకుని గటగటా త్రాగేడు. ఆపైన అటూఇటూ చూసేడు-నావంక చూసేడు-అలా చూస్తూనే తళతళలాడుతున్న ఆగ్లాసుని టక్కున ప్యాంటు జేబులోకి తోసేసాడు.

అమ్మ దొంగరాస్కెల్-ఎంతధైర్యం నీకు. నాలాంటి పెద్దమనిషి, గౌరవనీయుడు ఎదురుగ్గా వుండగానె-దేశం పాడైపోయింది. రాష్ట్రం అంతకన్నా పాడైపోయింది. పద్మాహోటలు గూడా పాడైపోయింది. చెప్పెయ్యాలి దొంగవెధవని పట్టించాలి. సత్యమేవ జయతే-ధైర్యేసాహసే లక్ష్మి- చెప్పెయ్యాలి-పౌరుడిగా నాపనినే చెయ్యాలి- ఎవరికి చెప్పను? తెల్లలుంగీ కట్టి కిళ్ళీనములుతూ అటూఇటూ ఇన్విజిలేటరాగా తిరుగాడుతున్న సూపర్‌వైజర్‌కి చెప్పనా? కౌంటర్లో కోర్చుని కన్నడ ప్రభ చదూవుతున్న యజమానికి చెప్పనా! ఆ టేబిలు వద కూర్చొని కాఫీ కోసం చూస్తున్న కానిస్టేబిలు గారికి విన్నవించనా-వద్దు వాడికి విన్నవించుకుంటే గ్లాసుతోపాటు మరింత ఆస్తి నష్టం జరిగే, ప్రమాదం వుంది. అంచేత సాక్షాత్తు యజమానికి చెప్పటం వుత్తమ పౌరుడి లక్షణం-పదిరూపాయల గ్లాసు జేబులోకి తోసేసి, అర్ధరూపాయి బిల్లు అడిగి మరిపుచ్చుతుంటున్నాడు. హమ్మో హమ్మో ఏం మోసం, ఏందగా! దేశం ఎలా బాగుపడుతుంది! పడదు-అదేమిటి నావైపు అలా చూస్తున్నాడు? కొంపతీసి వాసన పట్టేడా? ఎందుకైనా మంచిది పేపరు అడు పెట్టుటం మంచిది-

'ఇటీవల కట్టిన బ్రిడ్జి వరదల్లో కొట్టుకుపోయిన వైనం'

'దేశంలో నల్లడబ్బు కొన్ని వేలకోట్ల వరకు వుండొచ్చని ఆర్థిక మంత్రి అంచనా'

'మగువలని విదేశాలకు అమ్మేస్తున్న బిషప్'-

'డ్రైనేజీ గుంటలో పడి పసిపిల్ల మృతి'

అరెరె-వాడేడి అడిగడిగో బిల్లు చెల్లించి వెళ్ళిపోతున్నాడు- ఇదేవిటి వాడిమీద కసి కోపం ఒక్కసారే జారిపోయాయి? పైగా జాలిగూడా వేస్తోంది. కంటపడ్డ చిన్నచేపా? కంటపడని పెద్దచేపలపై కోపమా? ఏవిటో నాకే తెలీటం లేదు- వేడివేడిగా ఇంకో కాఫీ సేవిస్తేనేగాని ఏం చెప్పలేను- బోయ్!

After all life is an aquarium,
If you look at it from out side it is comedy.
If you involve inside, it is a big tragedy.




మీరు కథ వ్రాయండి.

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా వుపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథనిరాసి వెంటనే పంపండి. ప్రచురార్హమైన కథారచయితలకి పాతికరూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"యూ స్కౌండ్రల్" అంటూ పార్కులో తన భర్తని చాచి లెంపకాయ కొట్టింది రాధ.

## ఇది నిజం

సినీ ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద ముద్దు దృశ్యం 1941లో విడుదలైన ఆంగ్ల చిత్రం 'యు ఆర్ ఇన్ ది ఆర్మీ' నాలో వుంది. రెగ్ టూమీ, జేన్ వైమెన్ ఒకరినొకరు గాఢంగా పెనవేసుకుపోయి సుమారు మూడు నిముషాల ఐదు సెకన్లు ముద్దులో మునిగితేలారు.